క్లుప్తంగా

కంటివెలుగును వినియోగించుకోండి

దౌల్తాబాద్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఊరగుంట, దౌల్తాబాద్ గ్రామాల్లో 154 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యులు వెల్లడించారని, ఇందులో 34మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి రతన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

వరికొనలను తుంచి నాటువేయండి

పరిగి: వరికొనలను తుంచి నాటు వేయడం ద్వారా అధిక దిగుబడితో పాటు చీడపీడలను నివారించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఖుదవాన్‌పూర్ గ్రామంలో సుంచకరి చుక్కయ్య రైతు పొలంలో కొనలు తుంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తప్పకుండా వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు. వరిసాగులో భాస్వరం చాలా ముఖ్యమైందని, కావున రైతులు డీఏపీ కలిగిన కాంప్లెక్స్ ద్వారా పంటలకు అందజేయాలని సూచించారు. రైతు వేదికలో నిర్వహించే అవగాహన సదస్సులకు రైతులు తప్పకుండా హాజరై సూచనలు పాటించాలని చెప్పారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

యాలాల: సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని లంబాడ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి రాజురాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 12 నుంచి 15 వరకు నగరంలోని బంజార భవన్‌లో నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయంతం చేయాలని, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాజు చెప్పారు. జయంతోత్సవాలకు జిల్లాలోని ప్రతి తండా నుంచి 30 మంది యువకులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

వరిలో జింక్‌లోపాన్ని నివారించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

బొంరాస్‌పేట: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పద్మావతి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని లింగస్‌పల్లి, మాచన్‌పల్లిలో వానకాలంలో వేసిన వేరుశనగ, ప్రస్తుత యాసంగిలో సాగుచేసిన వరి పంటలను పరిశీలించి, తెగులు సోకిన వరి గురించి రైతులకు తగిన సూచనలు ఇచ్చారు. డ్రమ్ సీడర్‌తో నేరుగా విత్తిన వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. జింక్‌లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రేణుక, హేమ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కుల్కచర్ల: ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కాళికాదేవి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మక్తవెంకటాపూర్ జెడ్పీటీసీ రాందాస్ నాయక్, సర్పంచ్ అనిత, నాయకులు వెంకట్‌లు తెలిపారు. మంగళవారం చౌడాపూర్ మండల మక్తవెంకటాపూర్‌లో గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. రేపటి నుంచి 12 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

'సదరం'ద్వారా ధ్రువీకరణ పత్రాలు

అనంతగిరి: దివ్యాంగులకు సదరం క్యాంపు ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు మీసేవా కేంద్రాల్లో ఈ నెల 9న ఉదయం 11 గంటల నుంచి అర్హులు స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ కృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న తాండూర్‌లో ఓహెచ్ కేటగిరి వారికి, 14న వికారాబాద్‌లో ఓహెచ్ కేటగిరి వారికి, 22న వికారాబాద్‌లో హియరింగ్ వారికి, 27న తాండూర్‌లో యంఆర్, యంఐ వారికి క్యాంపులు ఉంటాయని, అర్హులైనవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

దౌల్తాబాద్: ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సహకారంతో మండలంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఊరగుంట సర్పంచ్ రెడ్యానాయక్ ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను వారు ఖండించారు. ప్రతిపక్షంలో ఉన్న గ్రామాలకు నిధులు కేటాయించడం లేదని, రోడ్డు మంజూరు చేయడం లేదంటూ చేసిన ఆరోపణలు సరైనవి కావని, పార్టీలకు అతీతంగా గ్రామాలకు నిధులు కేటాయించి ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తున్నారని వారు వెల్లడించారు.

ప్రజా సంక్షేమం పట్టని అధికారులు

- విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించని సమీక్షలెందుకని నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దౌల్తాబాద్: 'అధికారులు తమకు ఏ మాత్రం సహకరించడం లేదు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా గ్రామ సమస్యలు విన్నవిస్తే పట్టించుకోవడం లేదు. అసలు ప్రజా అవసరాలపై వారికి పట్టింపు లేదు' అని అధికారుల పని తీరును ఆరోపిస్తూ.. సభ్యులు మండిపడ్డారు. మంగళవారం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. సభ ప్రారంభం అనంతరం తొలుత వ్యవసాయశాఖపై ఏఓ లావణ్య నివేదిక చదివి వినిపించారు. ట్రాన్స్‌కో ఏఈ మహిపాల్ నివేదిక చదువుతుండగా గుండేపల్లి సర్పంచ్ మధుసూదన్ మధ్యలో కల్పించుకొని.. 'సమస్య ఉందని ఫోన్ చేస్తే స్పందించవు. ఇప్పటికీ గ్రామంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు లేక ఇబ్బందిగా ఉందని చెప్పినా పట్టించుకోవు' అని ఏఈపై మండిపడ్డారు. ఊరగుంట, కుప్పగిరి సర్పంచులు రెడ్యానాయక్, హరికృష్ణలు మాట్లాడుతూ ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఐసీడీఎస్‌పై సూపర్‌వైజర్ మాట్లాడుతుండగా.. సెంటర్లకు కాంట్రాక్టర్ నాసిరకమైన సరుకులు, పాలు పంపిణీ చేస్తున్నారని దౌల్తాబాద్ సర్పంచ్ శిరీష ఆరోపించారు. గ్రామపంచాయతీలకు సొంతభవనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీపీ

పీహెచ్‌సీలో సిరంజీల కొరత ఉందని ఎంపీటీసీ మంజుల సమావేశంలో చెప్పారు. కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలని సర్పంచులు, ఎంపీటీసీలను వైద్యాధికారి రతన్‌లాల్ కోరారు. పీఆర్ఏఈ మాట్లాడుతూ మనఊరు–మనబడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఊరగుంటలో ఉన్న సమస్యలను సర్పంచ్ రెడ్యానాయక్ వివరిస్తుండగా ఎంపీపీ, సర్పంచ్ మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకని సభ్యులు అసహనం వ్యక్తంచేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీఓ రవీందర్, కోఆప్షన్ మెంబర్, జాకీర్‌అలీ, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ భీములు, ఏఈలు, సర్పంచులు పాల్గొన్నారు.

'ధరణి'ని తక్షణమే పరిష్కరించండి

కలెక్టర్ నారాయణ్‌రెడ్డి



అనంతగిరి: జిల్లాలో ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, అందుకు తప్పనిసరిగా తహసీల్దార్లు ఈ కింది సూచనలు పాటించాలని కలెక్టర్ నారాయణ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి తహసీల్ కార్యాలయంలో ధరణి సహాయం కేంద్రం విధిగా ఏర్పాటు చేయాలని, కేంద్రంలో రెవిన్యూ, ధరణి పోర్టల్‌పైన అవగాహన కలిగిన ఒక ఉద్యోగిని నియమించాలని ఆదేశించారు. అలా నియమించిన అధికారి దరఖాస్తు దారులకు ధరణి సమస్యలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, అతని సమస్య పరిష్కరించేదా కాదా? సివిల్ తగాదా కిందికు వస్తుందా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. సివిల్ దావా కిందికు వచ్చే సమస్యలను ఆయా సివిల్ కోర్టులో పరిష్కరించుకునే విధంగా అర్జిదారులకు సూచించాలని పేర్కొన్నారు. ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో ధరణి ఫిర్యాదులపై ప్రజావాణి ఏర్పాటు చేయాలని, అన్నదాతలు అందజేసిన ఫిర్యాదులను వీలైనంతా త్వరగా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మరింత చేరువగా విద్యుత్ సేవలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతగిరి: నియోజకవర్గంలో త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభమవుతాయని, దీంతో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువ కానున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం తన నివాసంలో ట్రాన్స్‌కో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడారు. మీతోనేను కార్యక్రమంలో గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కార పనులు వెంటనే జరిగిపోవాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ జయరాజు, డీఈలు సంజీవ్, భానుప్రసాద్, ఏడీ సత్యనారాయణ, ఏఈలు రమణ, ప్రమోద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి



డీపీఓ తరుణ్ కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచులు, జీపీ కార్యదర్శులు

దోమ: సర్పంచుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షకు డీపీఓ తరుణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను రాజిరెడ్డి డీపీఓకు వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు అప్పులు చేసి చేశామని, వాటి బిల్లులు రాక.. తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారి దృష్టికి తీసుకువచ్చారు. కనీసం పంచాయతీ కార్మికుల జీతాలను కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందని వాపోయారు. వెంటనే సర్పంచుల సమస్యలు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీపీఓ తరుణ్ కుమార్‌ను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దాదాపూర్ సర్పంచ్ కృష్ణ, దోర్నాల్‌పల్లి సర్పంచ్ యాదయ్య సాగర్, తిమ్మాయిపల్లి సర్పంచ్ అర్చన, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే 'ధరణి' కేంద్రాలు

- ధ్రువ పత్రాలతో వస్తే.. సమస్య పరిష్కరిస్తాం: తహసీల్దార్లు



కుల్కచర్ల: రెవెన్యూ సమస్యల పట్ల అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

కుల్కచర్ల: రైతు సంక్షేమం కోసం.. కలెక్టర్ ఆదేశాలతో స్థానికంగా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చౌడాపూర్ తహసీల్దార్ అశోక్‌కుమార్, కుల్కచర్ల తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి సహాయ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మండల పరిధిలోని రైతుల సమస్యల పరిష్కారం కోసం ధరణి కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్నదాతలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఈ ధరణి సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగంలోకి తెచ్చామని వారు వెల్లడించారు.

నేటి నుంచి హెల్ప్ డెస్కు

మోమిన్‌పేట: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నుంచి ధరణి హెల్ప్ డెస్కు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ హెల్ప్ డెస్కులో సరైన పత్రాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి సోమవారం ప్రజావాణి

ధారూరు: ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధరణి హెల్ప్‌డెస్కు కొనసాగుతుందని తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో ధరణి హెల్ప్‌డెస్క్ ప్రారంభం అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ధరణి సమస్య ఉన్న రైతులు.. సరైన ధ్రువ పత్రాలతో డెస్కును సంప్రదిస్తే.. సమస్య పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఇక నుంచి ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

రైతులు వినియోగించుకోవాలి

దోమ: రైతులు ధరణి సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ షాహెదబేగం అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణ్ రెడ్డి ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. భూ సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నట్లయితే.. సహాయ కేంద్రానికి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సహాయ కేంద్రం ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ధరణి సహాయకులు రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'ధరణి'

కొడంగల్: భూమికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే.. రైతులు ధరణి సహాయ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బుచ్చయ్య చెప్పారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయంలో ధరణి సహాయ కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సహాయ కేంద్రంలో అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.



ధారూరులో.. హెల్ప్‌డెస్క్‌కు దరఖాస్తు చేస్తున్న రైతులు

ధరణి సేవలు అందుకోండి

బొంరాస్‌పేట: ధరణి సేవలను వినియోగించుకోవాలని తహసీల్దార్ షర్మిల అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ధరణి సేవల కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. సహాయ కేంద్రంలో వీఆర్ఏలు భీమయ్య, రాములు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీ పెట్టుకోవాలని చెప్పారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు న్యామత్‌నగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, ఇందులో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు రవీందర్, కృష్ణ, నాగేశ్వర్, మునీర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

దశలవారీగా కరెంటు సమస్యల పరిష్కారం

ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా



సమీక్షలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో అధికారులు, ప్రజాప్రతినిధులు

యాలాల: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా తెలిపారు. మంగళవారం ట్రాన్స్‌కో తాండూరు ఏడీఈ ఆదినారాయణ, ఏఈ భానుప్రకాష్‌ల సమక్షంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో నిర్వహించిన సమీక్షలో జీపీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులకు నివేదించగా.. స్పందించిన అధికారులు మాట్లాడారు. ఏళ్లుగా గ్రామాల్లో కరెంట్ స్తంభాలు, ఫీడర్ల సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, వేలాడుతున్న తీగలు, విద్యుత్‌బుడ్డీల నిర్వహణ లోపం వంటి సమస్యలను గుర్తించామని చెప్పారు. దశలవారీగా ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, సిద్రాల సులోచన, ఎంపీటీసీలు దేవగారి రాములు, గరివప్ప, రాములు తదితరులు ఉన్నారు.

'విద్యార్థుల భవిష్యత్ మీ చేతుల్లోనే..'

కుల్కచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మాట్లాడారు. వసతిగృహంలో ఉండే విద్యార్థుల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి తల్లిదండ్రులు ఎక్కువగా వలస వెళ్లి.. జీవనం సాగిస్తున్న నేపథ్యంలో వారి చిన్నారులను సంరక్షిస్తూ.. విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల చిన్నారుల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కుల్కచర్ల గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వార్డెన్ రాజు, స్థానిక ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలో జరిగిన జ్యోతిర్లింగాల మహాపడి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేకపూజలు చేసి మాట్లాడారు. శివమాలధారణ అనేది అత్యంత పవిత్రమైందని చెప్పారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొడంగల్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు.

పనితీరులో పద్ధతి మార్చుకోండి

ఏఈఓలతో ఏడీఏ రుద్రమూర్తి



రైతు కేంద్రంలో మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

పెద్దేముల్: ఏఈఓలు తమ పనితీరు మార్చుకోవాలని, విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని ఏడీ రుద్రమూర్తి హెచ్చరించారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఈఓలు తమ ఉద్యోగ ధర్మాన్ని విస్మరించవద్దని, ఇప్పటికే పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు అందాయని చెప్పారు. తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. మరోసారి రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా తట్టేపల్లి, కందనెల్లి క్లస్టర్ల ఏఈఓలు తమ పనితీరు మార్చుకోవాలని, రైతుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, ఇలానే కొనసాగితే పరిస్థితులు వేరేలా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ నజీరోద్దిన్, ఏఈఓలు వినయ్‌కుమార్, స్వాతి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం నేడు

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనం బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేతనాల వెతలు తీరేదెన్నడో..

- జీపీ కార్మికుల భిక్షాటన
- మూడునెలలుగా జీతాలు పెండింగులో ఉన్నాయంటూ ఆవేదన



భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

ధారూరు: గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు సకాలంలో బిల్లు రాక అప్పుల పాలై అవస్థలు పడటం, కొందరు సర్పంచులు ఏకంగా ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన సంఘటనల నేపథ్యంలో వేతనాలు రాక, కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో భిక్షాటన చేయడం జీపీ కార్మికుల వంతైంది. ధారూరు మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు మంగళవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. మూడు నెలల నుంచి జీపీ నుంచి వేతనాలు అందక కుటుంబ పోషణ భారమైందని, తాము అర్ధాకలితో ఉన్నా పిల్లల ఆకలి తీర్చాలన్న తపన తమను వేధిస్తోందని కార్మికులు ఆందోళన చెందుతూ.. ఈ కష్టాల నుంచి గట్టెక్కేదెన్నడో అంటూ వాపోయారు. మల్టీపర్పస్ వర్కర్లు, వాటర్‌మెన్లు, కారోబార్‌కు వేతనాలు నెలనెలా అందకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారని, వీరి జీతాలకు సంబంధించిన చెక్కులను జిల్లా ట్రెజరీకి పంపినా క్లియరెన్స్ కాకపోవడంతో జీపీ కార్మికులకు వేతనాలు అందటం లేదని సమాచారం. దీంతో కార్మికులంతా ఇంటింటికీ తిరిగి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా తమకు ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

చెక్కులు క్లియర్ కాలేదు

పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, కారోబార్‌కు నెలకు రూ.95 వేలచొప్పున 3 నెలల వేతనాలకు సంబంధించిన చెక్కును ట్రెజరీలో ఇచ్చినా క్లియర్ కాలేదు. గ్రామపంచాయతీ అకౌంట్ నుంచి డబ్బులు డ్రా అయినట్లు చూపిస్తున్నా.. చెక్కులు క్లియర్ కాక వేతనాలు ఇవ్వలేకపోయాం.

– చంద్రమౌళి, ధారూరు సర్పంచ

నీటి వృథాకు అడ్డుకట్ట పడేనా?

ధారూరు: మండల పరిధిలోని దోర్నాల్ గ్రామంలో నిత్యం నీటి వృథా అవుతోందని మంగళవారం స్థానికులు చెప్పారు. గ్రామ సమీపాన వాగు దగ్గర వేసిన బోరు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేస్తున్నారని, మధ్యలో వాలు వద్ద నీరు లీకేజీ అవుతుందని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు తగినంత సరఫరా కానందున.. బోరు ద్వారా నీటిని అందిస్తున్నారని తెలిపారు. ఇలా నీటి వృథాతో పాటు విద్యుత్ దుర్వినియోగం అవుతుందని, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన వాలు నుంచి లీకవుతున్న నీరు